## 70

# ఇర్వింగ్ వాలస్

ఒక నవలకోసం రచయిత పడే పురిటి నొప్పులు ఎలా వుంటాయి? నవల నా రచయిత తన మనోకోశంలో ఎంతకాలం మోస్తాడు? దానికి అంకురార్పణ ఎలా జరుగుతుంది? తీరా చేసి కూచున్నాక ఆ రాయడం అన్నదానిలో వున్న సాధక బాధకాలు ఏమిటి?—అన్నవి చిరంజీవులయిన ప్రశ్నలు. ఎంతమంది రచయితలున్నారో ఈ ప్రశ్నలకు అన్ని జవాబులున్నాయి.

రాబర్ట్ లూయిస్టీవెన్‌సన్ "డా॥ జెకిల్ అండ్ మిష్టర్ హైడ్"ని మూడు రోజులలో రాయగా, "ది షిప్ ఆఫ్ ఫూల్స్"ని రాయడానికి కేథరిన్ ఆన్ పోర్టర్‌కు ముప్పై సంవత్సరాలు పట్టింది! ఎర్నెస్ట్ హేమింగ్వే యొక్క "ది సన్ ఆల్సో రైసెన్"కు ఆరు వారాలు పట్టగా "మదాంబొవరీ" రాయడానికి గస్తావ్ ఫ్లాబర్ట్ 15 సంవత్సరాలు తీసుకున్నాడు.

సుప్రసిద్ధ అమెరికన్ రచయిత ఇర్వింగ్ వాలస్ తన విశిష్టమైన నవల "ది ప్రైజ్" రాయడానికి 15 సంవత్సరాలు కృషిచేశాడు. నోబెల్ పురస్కారాల తెరవెనుక భాగోతాలను నిశితంగా విమర్శించి, స్వీడన్ దేశంలో నిషేధింపబడిన ఈ గొప్ప నవల బీజం వాలస్ మనస్సులో 1946లో నాటుకోగా, నవల మొదటి చిత్తుప్రతి రాయడం 1961 లో పూర్తి అయింది. 62 జూన్‌లో 40,000 ప్రతులు వెల్వడనున్నాయని ప్రకటించగానే మొత్తం 55,000 ప్రతులకు అడ్వాన్స్ ఆర్డర్లు వచ్చాయి. ఆగష్టులో మరొక 7500, సెప్టెంబర్‌లో 7500, నవంబర్‌లో 7500

ప్రతులు అచ్చువేయవలసి వచ్చింది. నవంబర్ నాటికి 82000 వేల ప్రతులు అమ్ముడయ్యాయి, ఆ తర్వాత సంవత్సరంలో మొత్తం 17 లక్షల ప్రతులు చెల్లిపోయాయి. ఈ నవల తర్జుమాలు అటు ఫ్రెంచినుంచి ఇటు జపానీస్‌దాకా కాకుండా అంధుల భాష అయిన 'బ్రెయిల్'లో కూడా అచ్చయింది.

రచయిత నవల వ్రాత ప్రతిని పంపగానే ప్రచారణకర్తలయిన సైమన్ అండ్ షుస్టర్ అతడికివ్వాల్సివచ్చే రాయల్టీకి అడ్వాన్సుగా రు. 5,60,00 ఇచ్చారు. ఈ నవల కథను సినిమా తీయడానికి ఎన్నుకున్న ఎం. జి. ఎం. వారు రచయితకు 29 లక్షలు చెల్లించారు!

మన మతిని చెదరగొట్టే ఈ అంకెల వెనుక వున్న రచయిత కృషిని చిత్తగించండి.

1946లో స్వీడన్‌లో పర్యటిస్తుండగా కుతూహలంకొద్దీ ఇర్వింగ్ వాలస్ నోబెల్ బహుమతుల గురించి కొంత సమాచారం సేకరించాడు. దానిలో రెండు మూడు వ్యాసాలు రాశాడు. 1948లో రాసిన ఈ 120 పేజీల వ్యాసంలో నోబెల్ బహుమతుల వెనుకనున్న ఆవక తవకల్ని బయట పెట్టడంలో — అది పత్రిక వారి సెన్సారింగ్‌కు గురి అయింది. దాంతో ఇర్వింగ్ వాలస్‌కు చిర్రెత్తుకొచ్చి దీనిమీద నవల రాయాలి అనుకున్నాడు. 1949లో ఒకటి రెండు ప్రణాళికలు వేసుకున్నాడు. పాత్రల జాబితా తయారుచేసుకున్నాడు. ఆ పాత్రల రూపురేఖలు, గుణగణాలు ఇలా వుండాలి అని రాసుకున్నాడు. కాని అతడికెందుకో ఆ ప్రణాళిక, ఆ పాత్రల వివరాలు సంతృప్తి నివ్వలేదు—ఇదమిద్ధంగా తేల్చుకోలేని ఆ అవ్యవస్థలో రచయిత పడే ఆవేదన గురించి వాలస్ ఇలా రాశాడు.

"నా ప్రణాళికను చదివితే నేను అసలు సమస్యను ఎదుర్కోవడానికి, గోదాలో దిగడానికి జంకుతున్నట్లు అనిపించింది. అసలు విషయాన్ని ఔపాసనపట్టి పాఠకుడి ఎదుట పెట్టడానికి నా రచనాశక్తి చాల

దేమోనన్న చిరాకు నాలో కన్పడింది. ఇది రచయితలందరి అనుభవం లోనిదే. ఒకానొక విషయాన్ని తీర్చిదిద్దడం అయితేనేమీ, ఒకే ఒకఘట్టాన్ని రచించడం అయితేనేమి అది జటిలమన్పించింది-రచయిత భయం భయంగా అసలు విషయంలోకి చొచ్చుకువెళ్ళక అంచుల్లో తచ్చాడుతుంటాడు. రంగ ప్రవేశం చేయవలసిన సందర్భంలో సైడ్ వింగ్‌లో నిలబడి నీళ్ళు నములు తుంటాడు. కాని తనలో అసలు భయం. ఇది, అసలు సమస్య ఇది, అని తెలుసుకోగానే ఆతడు రంగంలోకి దూకుతాడు ఆ ఒక్క ప్రయత్నంలో అతడు అద్భుత విజయం సాధించలేకపోవచ్చుగాని, ఒకనాటికి అతడు గొప్ప రచయిత అయితీరుతాడు...''

ఈ కృత్యాదవస్థను దాటి నవల ప్రణాళిక, పాత్రల పట్టీ తయా రయ్యాక ఆ నవలలోని నోబెల్ బహుమానాలు అందుకోబోయే ఫిజిక్స్, కెమిస్ట్రీ, వైద్య శాస్త్రజ్ఞుల పాత్రచిత్రణ వాస్తవికతకు దగ్గరగా వుండా లని, రచయిత ఆయా శాస్త్రాలలో ప్రపంచ మొత్తంమీద జరుగుతున్న అత్యాధునిక ప్రయోగాల గురించి చదివాడు. ఆయా శాస్త్రాల నిపుణులతో తన ఊహలగురించి చర్చించాడు. నవలలో తాను రాయబోయే ప్రదేశాల గురించిన వివరాలు నోట్ చేసుకున్నాడు. స్వీడన్‌లో నోబెల్ కార్యాలయ వారితోను; ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, పెర్ల్‌బక్ వంటి నోబెల్ బహుమతి గ్రహీత లతోను ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. ఇదంతా అయ్యేసరికి 1960 అయింది. 1946-60 మధ్య స్వీడెన్ మారిందేమోనని ఆ దేశం వెళ్ళి అన్నిమార్పులు రాసుకున్నాడు.

1960 ఆగస్టు 4 నాటికి పాత్రల పట్టిక తయారయింది. వాటికి పేర్లు పెట్టడానికి ఇంకో రెండు నెలలు పట్టింది. ఒకానొక పేరు పెట్టాక, ఇది అచ్చంగా స్వీడిష్ పేరు అవునోకాదో అని స్వీడన్‌కు రాసి తెలుసు కోవడంలాంటి వాస్తాలు చూస్తే తెలుగు రచయితలకు నవ్వు రావచ్చు! నోబెల్ బహుమతి కార్యాలయంలోని మేజా పొడవు; వెడల్పులు,

దానిచుట్టూ వున్న కుర్చీల సంఖ్య నోట్ చేసుకోవడం చూచి 'అమెరికన్ రచయితలు మరీ ఇంత జడులా' అని అబ్బురపడవచ్చు!

ఇంత అధ్యయనం, నోట్స్, పరిశీలన, పరిశోధన—జరిగాక నవలలో అధ్యాయల విభజన, వాటి వర్ణన రాసుకున్నాడు. అప్పుడు ఇర్వింగ్ వాలస్ 19 01-1960 న రాయడం మొదలుపెట్టి 21-2-1961న నవల మొదటి చిత్తుప్రతిని పూర్తి చేశాడు.

ఆతర్వాత ఆ ప్రతిలో, ప్రతిపేరును, వర్ణనను, ఘట్టాన్ని ఒకవైపు (పత్రికా రచయిత్రి అయిన) అతడి భార్య, ఇంకొకవైపు ప్రచురణకర్త యొక్క సంపాదకుడు, ఏ కీలుకు ఆ కీలు విడదీసి "క్రాస్ ఎగ్జామిన్" చేస్తే, సబబు అనిపించినచోట్ల వాళ్ళు సూచించిన మార్పులుచేసి, వాళ్ళ వాదనలకు ఋజువులతో ఖండించగలచోట్ల ఖండించి నవలను పూర్తిచేశాడు ఇర్వింగ్ వాలస్.

ఈ నవలను తానెలా రాశాను అన్నదానిని అతడు రాసిన పుస్తకం చదువుతుంటే—మన పరిస్థితిని చూచి ఏడవ్వాలో నవ్వాలో తెలియలేదు. ఏడ్పుకన్న నవ్వు వాంఛనీయం కనుక నవ్వేద్దాం!!

ఏమంటారు !

★